
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

శనివారం 14 జూన్ 2025

రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించాలి

- ముంపు బాధితులకు పరిహారం చెల్లిస్తాం
- రెవెన్యూ డివిజనల్ అధికారి సుబ్రహ్మణ్యం
- ముంపు బాధిత రైతులతో ప్రత్యేక సమావేశం

7

గడప దాటని దుఃఖం

ఏదేమైనా ఐక్యం



ఆందోళనలో పెద్ద ధన్వాడ గ్రామస్థులు

- ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా భీష్మించుకున్న పెద్ద ధన్వాడ రైతులు
- అరెస్టులు, కేసులతో ఆందోళన, దుఃఖంలో జైలుకు వెళ్లిన వారి ఇళ్లు
- పునఃపరిశీలనకు మంత్రులను మరోసారి కలిసి విన్నవించాలని తీర్మానం
- ఏరువాక పౌర్ణమి చేసుకోని గ్రామం, రెవెన్యూ సదస్సులూ బహిష్కరణ
- ఖరీఫ్ సీజన్ కావడంతో పనులకు కూడా తీవ్ర ఆటంకాలు



పెద్ద ధన్వాడ గ్రామం

నా కొడుకులను అరెస్టు చేసిండ్రు



తాళం వేసి ఉన్న పార్వతి ఇల్లు

ఆ కంపెనీ వద్దన్నరని పొలం దగ్గర మోటార్ ఆఫ్ చేయడానికి వెళ్తుంటే నా ఇద్దరు కొడుకులు భరత్, సూర్యప్రకాష్‌లను రోడ్డుపై అడ్డగించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. పెద్దకొడుకు సూర్యప్రకాష్‌ను తీవ్రంగా కొట్టారు. సేద్యం చేసుకునే ట్రాక్టర్లు నిలిచిపోయాయి. కిస్తులు ఎలా కట్టాలో, పొలం ఎలా సాగు చేయాలో దిక్కుతోచడంలేదు.

- పార్వతి, పెద్ద దన్వాడ

ఏరువాక సాగలేదు... ఎవుసం చేసే పరిస్థితి లేదు... వీధులన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి... ఇళ్లలో నుంచి బయటికి వచ్చే వారు లేరు... అప్పుడప్పుడు గ్రామాల్లో గస్తీకి వచ్చివెళ్లే పోలీసు సిబ్బందిని చూసి గుండెలు గుభిళ్లు మంటున్నాయి... జైలుకెళ్లిన వారు ఎప్పుడు వస్తారా అనే ఎదురు చూపులు... ఏదేమైనా గ్రామస్థులంతా ఐక్యంగా ఉన్నరు. వారికి వారు ధైర్యం చెప్పుకుంటున్నరు.. బాధితులకు తలా ఓ చెయ్యేసి భరోసా ఇస్తున్నరు.... సమస్యను సావధానంగా పరిష్కరించుకునేందుకు మంత్రుల గడప తొక్కాలని సిద్ధమౌతున్నరు... మా విన్నపాలు వినండని వేడుకుంటున్నరు.. ఇది ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన జరిగిన జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ గ్రామాల్లోని పరిస్థితి... ఆందోళన తర్వాత అరెస్టులు, కేసులతో ఆయా గ్రామాల్లో నెలకొన్న గంభీరమైన పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి గ్రౌండ్ రిపోర్ట్'..

ఆంధ్రజ్యోతి గ్రౌండ్ రిపోర్ట్

మహబూబ్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు తెలిపిన నిరసన ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసిన విషయం తెలిసిందే.. ఈ ఆందోళనలో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేసి 12 మందిని రిమాండ్‌కు కూడా తరలించారు. పరిస్థితి సద్దుమణిగే వరకు కంపెనీ ఏర్పాటు ప్రాంతంలో ఎలాంటి పనులు చేపట్టే అవకాశం కనిపించడం లేదు. ఆందోళన జరిగిన మరుసటి రోజే అక్కడికి తెచ్చిన వాహనాలను కంపెనీ తీసుకెళ్లింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇథనాల్ కంపెనీల ఏర్పాటుపై కచ్చితమైన ధోరణిని అవలంబిస్తున్నాయి. పర్యావరణ హితం కోసమే ఈ ఫ్యాక్టరీలను నిర్మిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. కానీ రైతులు, గ్రామస్థులు మాత్రం తమ ప్రాంతంలో కంపెనీ ఏర్పాటు వద్దేవద్దని భీష్మించుకొని ఉన్నారు. తమ కోసం కాదు. తమ పిల్లల భవిష్యత్ కోసం కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్లు పునరుద్ఘాటిస్తున్నారు. దాదాపు 10 రోజుల క్రితం ఆందోళన ఉద్రిక్తతలకు దారితీయగా ప్రస్తుతం ఆ గ్రామంలో నెలకొన్న పరిస్థితులు వారు భవిష్యత్ కార్యాచరణ ఏ విధంగా తీసుకోబోతున్నారు.? కేసులు అయిన వారిని అందులో నుంచి బయటకు రప్పించుకునేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అనే విషయాలపై ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించింది. ఇందులో గ్రామస్థులు, జైలుకు వెళ్లిన వారి కుటుంబాల్లో నెలకొన్న ఆందోళనలను తెలుసుకుంది.

తొలి పండుగకు దూరం..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో

(మిగతా 6లో..)

అన్నింట్లో కమీషన్‌తో

రూ.కోట్లకు పడగలెత్తారు

- సీడ్ ఆర్గనైజర్లపై కమిషన్ ముందు మొరపెట్టుకున్న రైతులు
- విత్తనం, భూమిపై రైతులకు మాత్రమే హక్కులు
- వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి
- మోసాలపై వివరించిన కన్వీనర్ రంజిత్‌కుమార్
- క్షేత్ర పర్యటనలో రెండు వర్గాల ఘర్షణ



గద్వాల కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

గద్వాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్ల దోపిడీతో నడిగడ్డలో రైతులు విలవిలలాడుతున్నారని, అప్పులకు వడ్డీలు కట్టలేక భూములు కోల్పోగా ఆర్గనైజర్లు మాత్రం వందల ఎకరాలతో కోట్లకు పడగలెత్తారని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ముందు రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. శుక్రవారం గద్వాల కలెక్టరేట్‌లో సీడ్‌పత్తి రైతులు, కంపెనీలు, ఆర్గనైజర్లతో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు సమావేశం అయ్యారు. సీడ్ విత్తనోత్పత్తిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్గనైజర్లు, కంపెనీల దోపిడీపై వారు అనేక అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పెద్దరాముడు,

- మిగతా 6లో..

ఆపదలో ఆపన్నహస్తం



- ప్రాణ దాతలుగా నిలుస్తున్న రక్తదాతలు
- రక్తదానానికి ముందుకొస్తున్న యువత
- వాట్సాప్‌లో గ్రూపులు, ఫేస్‌బుక్‌లో ఖాతాల ఏర్పాటు
- ఆదర్శంగా నిలుస్తున్న పలు ఫౌండేషన్లు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

7

ఛాయ్ తాగేందుకు వచ్చి..

అనంత లోకాలకు..



- బొలెరో వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

అమరచింత, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఛాయ్ తాగేందుకు రోడ్డుపైకి వచ్చిన ఓ వృద్ధురాలు బొలెరో వాహనం ఢీకొని మృతి చెందింది. వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని నాగల్‌కడుమూర్‌లో శుక్రవారం ఈ విషాద సంఘటన జరిగింది. గ్రామస్థులు, ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం, ఉంద్యాల గ్రామానికి చెందిన ఉత్తమ్మ (70) భర్త 40 ఏళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు కొడుకులు లేకపోవడంతో నాగల్‌కడుమూర్‌లోని కుమార్తె వద్ద నివసిస్తోంది. శుక్రవారం ఉదయం ఆమె ఛాయ్ తాగేందుకు చేతి కర్ర సాయంతో మెల్లగా నడుస్తూ రోడ్డుపైకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన తెలుగు ఆంజనేయులు బొలెరో వాహనంలో వడ్ల సంచులు వేసుకొని అమరచింత వైపునకు వస్తున్నాడు. అదే సమయంలో రోడ్డు దాటుతున్న వృద్ధురాలు తడబడి కింద పడింది. ఆమె తలపై నుంచి బొలెరో వాహనం టైర్ ఎక్కడంతో తలపగిలి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె కుమార్తె, కాలనీ వాసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన తల్లిపాల నిల్వ కేంద్రం

తల్లీబిడ్డలకు వరం ధాత్రి కేంద్రం

- బాలింతల నుంచి తల్లిపాల సేకరణ
- పాలు లేనివారికి అందజేత
- పాలు ఎక్కువై బాధపడే తల్లులకు యంత్రాల ద్వారా మసాజ్
- 3 నెలల్లో సేవలు పొందిన 170 మంది బాలింతలు



'మా బిడ్డ కాన్పు అయ్యింది, ఇంకా పాలు పడలేదు. మా బిడ్డకు పాలు ఎక్కువై రొమ్ములో గడ్డలు అయ్యాయి. మా శిశువు ఇంకా పాలు తాగడం లేదు.' ఇలాంటి మాటలు ఆసుపత్రుల్లో తరచూ వింటుంటాం. ఆ సమస్యలన్నింటికీ మహబూబ్‌నగర్‌లోని జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ధాత్రి సమగ్ర తల్లిపాల నిర్వహణ కేంద్రం ద్వారా పరిష్కారం లభిస్తోంది. ఇక్కడ పాలు రాని వారు తమ శిశువులకు ఉచితంగా వాటిని తీసుకోవడంతో పాటు ఎక్కువైన వారు దానం చేసే అవకాశం ఉంది. సుశేణ స్వచ్ఛంద సంస్థ అందుబాటులోకి తెచ్చిన ఈ కేంద్రం ఉమ్మడి జిల్లాలోనే మొట్టమొదటిది. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తే పేద ప్రజలకు మరింత మేలు జరుగనుంది.

- మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం)

6

చేపల చెరువులపై గద్దలు!

- మత్స్యకారుల నోట్లో మట్టి
- సొసైటీల్లో పరపతి ఉన్న వాళ్లదే రాజ్యం
- చోద్యం చూస్తున్న మత్స్యశాఖ అధికారులు
- ప్రతీ ఏటా రూ.లక్షల్లో కుంభకోణం
- సబ్ లీజ్ వ్యవహారంపై కోర్టుకెక్కిన నాగర్‌కర్నూల్ మత్స్యకారులు

● ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

చేపల చెరువుల సబ్ లీజ్ వ్యవహారం వాస్తవమే. ఇందుకు సంబంధించి అనేక ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఇంకా ఎక్కడైనా చెరువులు సబ్ లీజుకిచ్చి మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతీస్తే లిఖితపూర్వకంగా తక్షణం ఫిర్యాదు చేయాలి.

- రజిని, ఫిషరీస్ ఏడీ

చేపల చెరువులపై మత్స్యకార సొసైటీల్లోని పెద్ద తలకాయలు పెత్తనం చెలాయిస్తూ రూ.కోట్లకు పడగెత్తుతున్నాయి. అధికారుల అండదండలతో కొందరు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. రాజకీయ నాయకులు కూడా వారి అక్రమాలను నిలువరించలేక పోతుండటం గమనార్హం. పర్యవసానంగా మత్స్యకారులు కష్ట నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1448చెరువులు, కుంటలు ఎల్లూరు, సింగవట్నం, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లు ఉన్నాయి. 235 సొసైటీలు ఉండగా అందులో 19వేలమంది సభ్యులు ఉన్నారు. ఇదిలా ఉంటే, చెరువుల్లో చేపల దోపిడీపై ఇదివరకు కందనూలు మత్స్యకారులు కోర్టుకెక్కిన విషయం తెలిసిందే. నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం చెరువును రూ.కోటీ 5 లక్షలకు లీజుకివ్వడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆరుగురు మత్స్యకారులు కోర్టుకెక్కడం చర్చనీయాంశమైంది. ఇలా అనేక రకాలుగా వారి ఆగడాలు కొనసాగుతుండటం.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పరిపాటిగా మారింది.

- నాగర్‌కర్నూల్, (ఆంధ్రజ్యోతి)

6





మత్స్య సంపదను దండుకుంటున్న వైనం (ఫైల్)

సెప్టెంబర్‌లో రాష్ట్ర స్థాయి టోర్నీ

- అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి శరత్‌చంద్ర

7

విద్యార్థుల సంఖ్య పెంచాలి

- ప్రభుత్వ కళాశాలలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి
- బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి



ఆత్మకూరు కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం రిజిష్టర్లను పరిశీలిస్తున్న బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ డిప్యూటీ డైరెక్టర్

ఆత్మకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది కంటే ఈ ఏడాది ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 30 శాతం విద్యార్థుల సంఖ్య అదనంగా పెంచేందుకు కళాశాల అధ్యాపకులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని బోర్డు ఆఫ్ ఇంటర్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఇంటర్మీడియట్ కళాశాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అనంతరం కళాశాల విద్యార్థుల హాజరు శాతం పట్టికను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డితో పాటు, ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి, సీనియర్ అధ్యాపకులు విశ్వేశ్వర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే మేఘారెడ్డి



అయ్యవారిపల్లిలో ఇందిరమ్మ ఇంటినిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

పెబ్బేరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని, ఇందుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేపట్టి, గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించి, బడిబాట కార్యక్రమాల్లో విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. బునాదిపురం, సూగూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను ప్రారంభించి, అంగన్‌వాడీ భవనం నిర్మాణం పనులకు శంకుస్థాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను సకాలంలో సమకూరుస్తున్న ప్రజాప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, క్రీడా రంగాలను బలోపేతం చేస్తూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వ పాలనలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లును ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిందంటే.. మాట తప్పకుండా నిలబెట్టుకుంటుందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో మాట ఇచ్చి పేదలను మోసం చేశారని విమర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, ప్రమోదిని, ఉపాధ్యాయుడు విజయవర్ధన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహనాయుడు, నాయకులు రంజిత్, రాంరెడ్డి, యుగేందర్‌రెడ్డి, రాజశేఖర్, వెంకటేష్‌సాగర్, మధుసూదన్, వెంకటేష్ పాల్గొన్నారు.

చేపల చెరువులపై గద్దలు

- మత్స్యకారుల నోట్లో మట్టి
- సొసైటీల్లో పరపతి ఉన్న వాళ్లదే రాజ్యం
- చోద్యం చూస్తున్న మత్స్యశాఖ అధికారులు

నాగర్‌కర్నూల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పేద మత్స్యకారులకు జీవనోపాధి కల్పించే చెరువులు దళారులకు దోపిడీ కేంద్రాలుగా మారుతున్నాయి. మత్స్యకార సొసైటీల్లో పెద్ద తలకాయలు అధికారుల అండదండలతో దోపిడీని యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పొలిటికల్ లీడర్లు కూడా వివిధ రాజకీయ కారణాలతో అక్రమాలను నిరోధించలేకపోతుండటం మత్స్యకారులకు శాపంగా పరిణమించింది.

సబ్‌లీజ్ పేరిట లక్షలు దండుకుంటున్న వైనం

జిల్లాలో 1448చెరువులు, కుంటలు ఎల్లూరు, సింగవట్నం, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లు ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 235 సొసైటీలు ఉండగా అందులో 19వేలమంది సభ్యులు ఉన్నారు. 2016 నుంచి 2024వరకు వందశాతం రాయితీపై చెరువులు, కుంటల్లో బంగారు తీగ, మృగాల, బొచ్చ లాంటి చేప రకాలను చెరువు, కుంటలతో పాటు రిజర్వాయర్లలో వదులుతున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు, కుంటలను నింపుతుండటంతో 365రోజుల పాటు నీటి లభ్యత ఉంటుంది. మత్స్యశాఖ కూడా వందశాతం రాయితీపై చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపలను వదలడంపై స్పష్టమైన ఆజమాయిషీ కరువు కావడంతో సామాన్య మత్స్యకారుల జీవనోపాధిపై దెబ్బపడుతుంది.

కోర్టుకెక్కిన కందనూలు మత్స్య కార్మికులు

చెరువుల్లో చేపల దోపిడీపై కందనూలు మత్స్యకారులు కోర్టుకెక్కారు. నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం చెరువును రూ.కోటి 5 లక్షలకు లీజుకివ్వడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆరుగురు మత్స్యకారులు కోర్టుకెక్కడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశం మత్స్యకార సొసైటీలో అగ్గిని రాజేసింది. విశేషమేమిటంటే చెరువుల్లో చేపలు పట్టుకుని జీవనోపాధి పొందే విధంగా చర్యలు తీసుకోవాల్సిన మత్స్యశాఖ అధికారులు కూడా బడాబాబులకు వత్తాసు పలకడంతో వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారులకు న్యాయం దక్కకపోవడంతో కోర్టు దాకా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మమ్మల్ని కాదని మీరు కోర్టుకు వెళ్తారా అంటూ కొందరు పెత్తందారులు వారి సభ్యత్వాలను రద్దు చేసే ప్రయత్నాలను కొనసాగిస్తుండటం గమనార్హం.


చెరువుల్లో పుట్టీలను వినియోగించి మత్స్య సంపదను దండుకుంటున్న వైనం (ఫైల్)

లీజులు ఎక్కడెక్కడ అంటే..

చెరువుల సబ్ లీజ్ వ్యవహారం జిల్లాలో పెద్ద ఎత్తున దుమారం రేకెత్తిస్తుంది. ఎల్లూరు, జొన్నల బొగుడ, సింగవట్నం, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లలో కైకలూరుకు చెందిన బడాబాబులు స్థానిక మత్స్యకారులను లోబర్చుకుని ఆలవి వలలతో మత్స్య సంపదను దోచుకుంటుండడంతో పునరుత్పత్తి ప్రక్రియ నిలిచిపోతుంది. ఇందుకు మత్స్యశాఖ అధికారుల్లో కొందరు పూర్తి సహకారం అందిస్తుండడం అనేక విమర్శలకు తావిస్తోంది. వడ్డెమాన్ భీమా సముద్రం చెరువు కొరమీను చేపలకు ప్రసిద్ధి. దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువుపై కూడా పెద్దల కన్నుపడింది. ఇక్కడున్న మత్స్యకారులకు ఆశ చూపి కేవలం కొర్రమీనుకు 30 నుంచి 50రూపాయలు చెల్లిస్తూ హైదరాబాద్, చెన్నై, ముంబయి ప్రాంతాలకు తరలిస్తూ దళారులు కిలోకు 300రూపాయల చొప్పున దండుకుంటున్నారు. పాలెం పెంటోని చెరువు, సింగవట్నం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లల్లో మత్స్యకారుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ నాయకులు వీరిని నిర్వీర్యం చేస్తూ లాభాలు దండుకుంటున్నారు. సొసైటీ సభ్యుల మధ్య నిప్పును రాజేస్తూ మత్స్యశాఖకు చెందిన అధికారులు లబ్ధి పొందుతున్నట్లు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల వరకు ఫిర్యాదులు వెళ్లాయి.

కుల వృత్తుల ప్రోత్సాహానికి శాపం

కుల వృత్తులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం చేపలు, గొర్రెలను పోషించడం ద్వారా ఉపాధి పొందేందుకు ప్రోత్సహకాలను ఇచ్చింది. ఈ క్రమంలో సబ్సిడీపై చేపల పెంపకానికి పెద్దపీట వేసింది. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు చేపట్టే క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో 2017 నుంచి 2020వరకు 75శాతం రాయితీపై 5వేల 865 మంది లబ్ధిదారులకు మోపెయిడ్లు, నాలుగు చక్రాల వాహనాలను, వలలను, ఇతర పనిముట్లను అందజేశారు. ఇందు కోసం 34కోట్ల 89లక్షల రూపాయలను వెచ్చించారు. సొసైటీలో పెద్ద తలకాయలు, అధికారుల అచేతనం కారణంగా ఇదంతా బూడిదలో పోసిన పన్నీరైంది. రాష్ట్ర ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై చేప పిల్లలను చెరువుల్లో వదలగా, సొసైటీల్లో పెద్ద మనుషులుగా కొనసాగుతున్న వారు చెరువుల్లో చేపల ద్వారా వచ్చే ఆదాయాన్ని దిగమింగుతున్నారు. సామాన్య మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సబ్ లీజ్ పేరిట లక్షలు దండుకుంటున్నారు. ఈ వ్యవహారంలో మత్స్య శాఖ అధికారులు కూడా మిన్నకుండడం విమర్శలకు తావిస్తోంది. నాగర్‌కర్నూల్, తుమ్మలసూగురు చెరువుల సబ్ లీజు వ్యవహారంపై మత్స్యకారులు ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. సబ్‌లీజుల వ్యవహారం హైకోర్టు దాకా వెళ్లడం పెద్ద చెరువుల్లో సొసైటీ సభ్యులు రెండు గ్రూపులుగా విడిపోయి తరచూ ఘర్షణలకు తలపడుతుండడం మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. ఇంకా లోతుగా విచారిస్తే క్షేత్ర స్థాయిలో అనేక అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉందని వర్గాలతో సంబంధం లేని మత్స్యకారులు 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

అన్నింట్లో కమీషన్‌తో రూ.కోట్లకు పడగలెత్తారు


పుటాన్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్

(5వపేజీ తరువాయి)

లవన్న, లక్ష్మన్, గోపాల్, ఆంజనేయులు, గోపాల్, కిష్టమ్మలు తమ బాధలను చెప్పుకొచ్చారు. చాలా ఏళ్ల నుంచి సీడ్ పత్తిని పండిస్తున్నామని, గత కొన్నేళ్ల నుంచి సీడ్ విత్తనాలు ఫెయిల్ అయ్యాయని ఆర్గనైజర్లు, కంపెనీలు ప్రకటించి మోసం చేస్తున్నాయని వివరించారు. వాళ్లు ఇచ్చే సీడ్‌లో 30శాతం బెరుకు ఉంటుందని వెల్లడించారు. దానికి కూడా మేము పెట్టుబడి పెట్టి నష్టపోయామని వివరించారు.

విత్తనం, భూమిపై రైతులకు మాత్రమే హక్కులు

విత్తనం, భూమిపై రైతులకు మాత్రమే హక్కులు ఉంటాయని త్వరలో కొత్తచట్టం ఈ మార్పులతో మీ ముందుకు వస్తుందని వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. పాలమూరు రైతులు కష్టజీవులు అని వారికి న్యాయం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. విత్తనం చట్టాలు చాలా ఉన్నాయని వాటి ఆధారంగా అధికారులు అనేక మార్గదర్శకాలు ఇచ్చారని వివరించారు. అయితే 2014 నుంచి ఈ మార్గదర్శకాలను ఎవరు పాటించడం లేదని వివరించారు.

అందుకే కంపెనీలు జీవోటీని తమకు అనుకూలంగా మార్చుకొని విత్తనాలు ఫెయిల్ అయినట్లు ప్రకటిస్తున్నాయని వివరించారు. కాగా అంతకు ముందు గద్వాల మండలం పు టాన్‌పల్లిలో సీడ్ పంటను పరిశీలించి రైతులతో వివరాలు తెలుసుకున్నారు.

40 మంది ఆర్గనైజర్ల చేతిలో 40 వేల మంది రైతులు

గద్వాలలో సీడ్ మాఫియా పెరిగిపోయిందని 40మంది ఆర్గనైజర్ల చేతిలో 40వేల మంది రైతులు నలిగిపోతున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్ కమిషన్‌కు వివరించారు. దాదాపు రూ.1000 వెయ్యి కోట్ల నుంచి 1500కోట్ల వ్యాపారం జరుగుతుందని వివరించారు. వాళ్లే సీడ్ ఇస్తారు..

అప్పుడు ఇచ్చి వడ్డీని వసూళ్లు చేస్తారు. కంపెనీల నుంచి కమిషన్ తీసుకుంటారు.. జిన్నింగ్ మిల్లులో రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తారని వివరించారు. గత కలెక్టర్లతో చేసుకున్న ద్వైపాక్షిక ఒప్పందాన్ని అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నారని వివరించారు. రైతు సంఘం నాయకుడు వీవీ నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వ పల్లయ్య, సీపీఐ, సీపీఎం నాయకులు వెంకటస్వామి, ఆంజనేయులు కూడా కమిషన్ ముందు పలు అంశాలను వివరించారు.

ఫెయిల్ అయిన సీడ్ ఇవ్వడం లేదు: ఆర్గనైజర్లు

కంపెనీలు ఫెయిల్ అయిన సీడ్‌ను ఇవ్వడం లేదని సీడ్ ఆర్గనైజర్లు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రాఘవేందర్‌లు కమిషన్ దృష్టికి తెచ్చారు. దీని వలన మేము మోసం చేస్తున్నామని రైతులు తమపై అనుమానం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. అదేవిధంగా ఫెయిల్ అయిన తర్వాత మరోసారి రైతు ముందే జీవోటీ టెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి లోపాలతో తాము అందరి ముందు దోషిగా ఉండాల్సి వస్తుందని కమిషన్ దీనిపై ప్రభుత్వానికి సూచనలు చేయాలని వారు కోరారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ.. తోపులాట

సీడ్ పంటను పరిశీలించేందుకు కమిషన్ చైర్మన్ సభ్యులు పుటాన్‌పల్లిలో పర్యటిస్తున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్ తన అనుచరులు, రైతులతో కలిసి అక్కడికి వచ్చారు. ఆర్గనైజర్ల దోపిడీ అరికట్టి రైతులకు న్యాయం చేయాలనే స్లోగన్ ఇస్తూ వచ్చారు. కాంగ్రెస్‌లోని ఓ వర్గం నాయకులు విజయ్‌ను అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కలగజేసుకొని కమిషన్ చైర్మన్‌తో మాట్లాడించారు. తిరిగి వెళ్లే సమయంలో ముందు గొడవ పడిన నాయకులు తిరిగి విజయ్‌కుమార్‌తో ఘర్షణ దిగారు. ఇరువర్గాలు తోసుకున్నారు. పోలీసులు కాంగ్రెస్‌లోని ఓ వర్గంను ముందుకు తీసుకెళ్లి పంపించారు. తర్వాత బీఆర్ఎస్ నాయకుడు విజయ్‌కుమార్‌ను బలవంతంగా వాహనం ఎక్కించి ధరూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత విజయ్‌తో పాటు నలుగురిపై కేసు నమోదు చేశారు.


ఘర్షణ పడుతున్న రెండు వర్గాలు

కొనసాగుతున్న టీజీ పీఈ సెట్

- మూడవ రోజు 323 మంది విద్యార్థులు హాజరు


రాష్ట్ర ఉన్నతవిద్యా మండలి వైస్ చైర్మన్ షేక్ మహమ్మద్‌ను సన్మానిస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్,అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో మొట్టమొదటిసారి నిర్వహిస్తున్న టీజీ పీఈసెట్ ఎంపికలు ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియను ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ షేక్ మహమ్మద్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, టీజీ పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కరువు జిల్లాగా ఉన్న పాలమూరు, ఇప్పుడు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తోందన్నారు. క్రీడలను కేరీర్‌గా ఎంచుకొనే విద్యార్థుల కోసం ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో పీయూ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● టీజీ పీఈసెట్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో బీపీఎడ్ కోర్సుకు 403 మందికి గాను, 248 మంది విద్యార్థులు హజరయ్యారు. 165 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీపీఎడ్ కోర్సుకు 132 మందికి గాను, 75 మంది హాజరయ్యారు. మరో 57 మంది హాజరు కాలేదని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్ తెలిపారు. .

'సుంకేసుల' నుంచి నీటి విడుదల

రాజోలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్ర శివారులోని సుంకేసుల జలాశయం నుంచి శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి జలాశయానికి 4,500 క్యూసెక్కులు వరద వస్తుండటంతో ఒక గేటు ఎత్తి, 4,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాయంత్రానికి వరద 13,200 క్యూసెక్కులకు పెరగడంతో, 13,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.60 మీటర్లకు నీరు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

తల్లీబిడ్డలకు వరం ధాత్రి కేంద్రం

- బాలింతల నుంచి తల్లిపాల సేకరణ
- పాలు లేనివారికి అందజేత
- పాలు ఎక్కువై బాధపడే తల్లులకు యంత్రాల ద్వారా మసాజ్
- 3 నెలల్లో సేవలు పొందిన 170 మంది తల్లులు
- అవగాహన కల్పిస్తే ఎంతో మందికి మేలు


పాలు పట్టించే విధానంపై అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ సిబ్బంది

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లోని జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ధాత్రి సమగ్ర తల్లి పాల కేంద్రం తల్లీ బిడ్డలకు వరంగా మారింది. హైదరాబాద్‌కు చెందిన సుశేణ హెల్త్ ఫౌండేషన్ సంస్థ ఆసుపత్రిలోని ఎంసీహెచ్ భవనంలో ఈ కేంద్రాన్ని ఏప్రిల్‌లో ఏర్పాటు చేసింది. ఇది తెలంగాణలోనే రెండో మదర్ మిల్క్ బ్యాంకు మొదటిది హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, భీమవరం, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి.

అందించే సేవలు ఇవే..

ఆసుపత్రిలో కాన్పు అయిన తల్లులకు పాలు ఎక్కువైతే వారి నుంచి యంత్రం ద్వారా పాలను సేకరిస్తారు. వాటిని పాశ్చరైజింగ్ చేసి, పాలు లేని శిశువులకు ఇస్తున్నారు. ప్రస్తుతం ఎస్ఎన్‌సీయూలోని పిల్లలకు ఈ పాలనే ఇస్తున్నారు. అందుకోసం ఇద్దరి రక్త పరీక్షలు బాగానే ఉండి, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని నిర్ధారించుకున్న తర్వాతే పిల్లలకు ఇస్తున్నారు. అదేవిధంగా పాలు ఎక్కువై, రొమ్ములో గడ్డలు కట్టిన వారికి ప్రత్యేక యంత్రాల ద్వారా మసాజ్ చేస్తారు. తద్వారా వారి రొమ్ములు తేలికగా మారి బిడ్డ పాలు తాగడానికి వీలుగా అవుతుంది. అంతేకాకుండా చనుమొనలు చిన్నగా ఉండి, శిశువు పాలు తాగలేని స్థితిలో ఉన్నవారికి కూడా యంత్రం ద్వారా నయం చేసి యధాస్థితికి తెస్తున్నారు.

దీంతో పాటు ఆసుపత్రిలో కాన్పు అయిన వారికి పాలు సమృద్ధిగా రావడానికి జాగ్రత్తలు, ఆహార నియమాలు, బిడ్డకు పాలు పట్టే విధానం గురించి కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఎవరికైనా తల్లిపాలు అవసరం అయితే ఈ కేంద్రానికి వచ్చి తీసుకెళ్లవచ్చు. పాలు ఎక్కువైన వారు ఈ కేంద్రంలో దానం చేయొచ్చు.

సేవలు పొందిన 170 మంది తల్లులు

ఈ మదర్ మిల్క్ బ్యాంకు ఏర్పాటు చేసిన మూడు నెలల్లో మొత్తం 170 మంది తల్లులు ఈ కేంద్రంలో సేవలు పొందారు. అందులో 76 మంది తల్లులు నేరుగా వచ్చి పాలు దానం చేశారు. అదేవిధంగా 138 మంది తల్లులు ఈ కేంద్రానికి వచ్చి యంత్రాల ద్వారా పాలను తీయించుకొని, తిరిగి తమ పిల్లలకు పట్టించుకున్నారు. ఇప్పటి వరకు 11,330 మిల్లీ లీటర్ల పాలను సేకరించారు. అందులో 1,065 మిల్లీ లీటర్లు పాలు లేని తల్లుల శిశువులకు ఇవ్వగా, మిగతా 9,730 మిల్లీ లీటర్లు తల్లులు తీసుకెళ్లి తమ పిల్లలకే ఇచ్చారు.

అవగాహన కల్పిస్తే ఎంతో మందికి మేలు..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పు అయ్యి పాలు రాక, రొమ్ములో గడ్డలు కట్టి ఎంతోమంది బాలింతలు బాధలు అనుభవిస్తున్నారు. వారికి అవగాహన లేకపోవడంతో శిశువులకు డబ్బా పాలు తాపుతున్నారు. దాంతో శిశువులు అనారోగ్య, ఎదుగుదల సమస్యలను ఎదుర్కొంటున్నారు. తల్లులు చనిపోయిన పిల్లలు, పాలు రాక మరికొంతమంది పిల్లలు అవస్థలు పడుతున్నారు. అలాంటి వారి కోసం జనరల్ ఆసుపత్రిలో తల్లిపాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ అవసరమైన వారికి తల్ల పాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు పాలు ఎక్కువైన వారు దానం చేయొచ్చు. ఆశ కార్యకర్తలకు ఈ సేవల గురించి అవగాహన కల్పిస్తే వారు అవసరమైన వారిని తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. కానీ అవగాహన లేకపోవడంతో దాతలు ముందుకు రావడం లేదు.

రొమ్ముల్లో గడ్డలు అయ్యి చాలా ఇబ్బంది పడ్డాను..



నేను కాన్పు అయిన తర్వాత నా బిడ్డ పాలు తాగలేదు. దీంతో పాలు ఎక్కువై రొమ్ముల్లో గడ్డలు అయ్యాయి. చాలా ఇబ్బంది పడ్డాను. సిస్టర్ నాకు తల్లిపాల నిర్వహణ కేంద్రానికి రావాలని చెప్పడంతో అక్కడికి వచ్చి, మిషన్‌తో మసాజ్ చేయించుకున్నాను. దీంతో గడ్డలు పోయి నార్మల్‌గా అయ్యాయి. అప్పటి నుంచి నా బిడ్డ పాలు తాగడం స్టార్ట్ చేసింది.

- వేణమ్మ, కోటకొండ

గడప దాటని దుఃఖం

ఏదేమైనా ఐక్యం

(5వ పేజీ తరువాయి)

ఏరువాక పండుగను రైతులు ఘనంగా జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంగా పశువులను కడిగి, అలంకరించి గ్రామదేవతల వద్ద పూజలు చేస్తారు. వ్యవసాయ పనుల సీజన్‌కు ముందు ఉగాది తర్వాత వచ్చే తొలిపండుగ కాబట్టి రైతులు పవిత్రంగా భావిస్తారు. అయితే ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేసిన ఆందోళన ఉద్రిక్తంగా మారి గ్రామాల్లోని కొందరిపై కేసులు నమోదు కావడం, అందులో కొందరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడంతో పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ రైతులు ఏరువాక పండుగను జరుపుకోవద్దని నిర్ణయించారు. తమవారు జైలు నుంచి వచ్చే వరకు, తమపై నమోదైన కేసులు తొలిగే వరకు అవసరమైతే ఏ పండుగలు కూడా జరుపుకోమని స్పష్టంగా చెబుతున్నారు. పెద్ద ధన్వాడలో శుక్రవారం నిర్వహించాలని భావించిన రెవెన్యూ సదస్సులను సైతం గ్రామస్థులు బహిష్కరించారు.

వారి ఇళ్లలో దుఃఖం...

ఆందోళనలో పాల్గొన్నారని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిన వారి ఇళ్లలో తీవ్ర దుఃఖ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనలో భరత్, సూర్యప్రకాష్, నాగేంద్ర, చిన్ననర్సింహ, తిప్పారెడ్డి, శివ, మనోహర్, భీమేష్, నరసింహ, కేశన్న, రాజు, పరుశరాముడు అరెస్టు అయ్యారు. ఒకే కుటుంబానికి చెందిన భరత్, సూర్యప్రకాశ్ ఇద్దరు అరెస్టు అయ్యారు. వారి తండ్రి నాగన్న కొన్నేళ్ల క్రితం చనిపోగా తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ వ్యవసాయం చేస్తూ, ట్రాక్టర్లు నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇద్దరు కుమారులు అరెస్టు కావడంతో తల్లి ఒంటరిగా ఉండలేక తన కూతురు గ్రామమైన తుమ్మిళ్లకు వెళ్లిపోయారు. వ్యవసాయ సీజన్ కావడంతో రెండు ట్రాక్టర్లు నడవక, కంతులు కట్టలేని పరిస్థితులు ఉన్నాయి. బి. చిన్ననర్సింహకు భార్య, ఐదుగురు పిల్లలు.. సెంటు పొలం కూడా లేని వారు అప్పు చేసి ఇళ్లు కట్టుకున్నారు.. కాయకష్టం చేసి అప్పులు తీర్చుకుంటున్న సమయంలో అరెస్టు కావడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో ఉన్నది. అరెస్టు అయిన వారి ఇళ్లలో ఎవరిని కదిలించినా ఇదే తరహా బాధను వెలిబుచ్చుతున్నారు. తమవారిని జైలుకు వెళ్లి చూసిరాగా వారు బక్కచిక్కారని, ఆందోళనతో ఏం తినడం లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.


ఉద్రిక్తత్తల్లో అరెస్టు అయ్యి జైలుకి వెళ్లిన భరత్, సూర్యప్రకాశ్ ట్రాక్టర్లు

ఈ సీజన్‌లోనే పని...

పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ గ్రామాల్లో పూర్తి వ్యవసాయ ఆధారిత కుటుంబాలు ఉంటాయి. వానాకాలం సీజన్‌లోనే వారికి చేతినిండా పని దొరుకుతుంది. పత్తి విత్తనాలు పెట్టడం, దుక్కులు సిద్ధం చేయడం, ఇతర ఆరుతడి పంటల విత్తనాలు వేసుకోవడం, కూలీ పనులకు వెళ్లడం వంటివే వారికి జీవనాధారం.. అయితే ఇథనాల్ ఫ్యాక్టరీ ఆందోళనలతో ఆ గ్రామాల్లో పనులు మందకొడిగా సాగుతున్నాయి.


ఇద్దరు కొడుకులు అరెస్టు కావడంతో తల్లి కూతురు దగ్గరకు వెళ్లడంతో తాళం వేసి ఉన్న ఇల్లు

జైలుకు వెళ్లిన వారి ఇళ్లలో పనులకు వెళ్లడం మానేయగా ఆందోళనలో పాల్గొని అరెస్టు, కేసులు అయిన వారి కుటుంబీకులు, ఆందోళనలో పాల్గొని కేసులు నమోదు కాని వారు కూడా ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. పోలీసులు అప్పుడప్పుడు వచ్చి వెళుతుండటంతో ఎం జరుగుతుందోననే ఆందోళన ఆయా కుటుంబాల్లో కొనసాగుతోంది. జైలుకు వెళ్లిన వారి ఇళ్లలో ఉండే పశువుల మేతకు కూడా ఇబ్బందులు అవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రుల వద్దకు మరోసారి...

వాస్తవానికి అరెస్టులు, జైలుకు పంపించకుండా కంపెనీ ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ చేస్తే ఇంత గందరగోళం నెలకొని ఉండేది కాదనే అభిప్రాయం ఉన్నది. అరెస్టులతో గ్రామాల్లోని ప్రజలు ఏకతాటిపైకి రావాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ పేరుతో తాత్కాలికంగా కొందరిని ఎన్నుకొని వారి ఆధ్వర్యంలో కార్యాచరణ అమలు చేయాలని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. కంపెనీ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉండటంతో మరోసారి మంత్రులను కలవాలని నిర్ణయించుకున్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రితోపాటు జిల్లాకు చెందిన మంత్రులు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కేసులు నమోదైన వారు, జైలుకు వెళ్లిన వారి విషయంలో గ్రామస్థులు చందాలు వేసుకొని ఖర్చులు చేయాలని, కేసులు తొలగే వరకు ఖర్చును మూకుమ్మడిగా భరించాలని తీర్మానం చేసుకున్నారు. అయితే ఇప్పటికైనా ప్రభుత్వం కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేసి అందుకు అనుగుణంగానే నిర్ణయం తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పస్తులైనా ఉంటం... కంపెనీని ఒప్పుకోం



నా భర్త బి. చిన్న నరసింహకు గతంలో అనారోగ్యం కారణం గా ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడు తూనే సుగ్గికి వెళ్లి బతికేటోళ్లం. ఏ తప్పూ చేయకున్న నా భర్తపై కూడా కేసు నమోదు అయ్యింది. అప్పు చేసి ఈ మధ్యనే ఇళ్లు క ట్టుకున్నం. ఇంటి మగమనిషిని అరెస్టు చేస్తే ముగ్గురు ఆడబిడ్డలు, ఇద్దరు చిన్నమగపిల్లలతో ఎట్లా బతికేది సారూ. మా ప్రా ణాలు తీసే కంపెనీలను మా అనుమతి లేకుండా పెడితే తప్పుకానప్పుడు వాటిని అడ్డుకుంటే తప్పెట్లయితది. పస్తులైనా ఉంటాం కానీ కంపెనీ ఏర్పాటును మాత్రం ఒప్పుకోం.

- శిరీష, బోయ చిన్ననరసింహ భార్య, పెద్దధన్వాడ

వంట చేసేందుకు వెళ్తుంటే..

నా భర్త ఎన్ తిప్పారెడ్డి శుభకార్యాలకు వంటలు చేస్తూ మరో వైపు వ్యవసాయ పనులు చేసుకుంటుండేవాళ్లం. ఆరోజు రాజోలిలో ఓ పెళ్లికి వంట చేసేందుకు వెళుతుండగా ఆకారణంగా అరెస్టు చేసి తీసుకెళ్లారు. అందరూ విత్తనాలు వేసుకుంటున్నారు. ఇంట్లో మగమనిషి లేకపోతే విత్తనాలు ఏడ తెచ్చుకోవాలి, ఎలా సాగు చేయాలి. అన్నం పెట్టే పొలాలు కంపెనీ వల్ల నాశనం అవుతాయి.

- సుజాత, తిప్పారెడ్డి భార్య, కుమారుడు, పెద్దధన్వాడ



ఈ పోరాటం మా కోసం... మా పిల్లల కోసం



కంపెనీకి వ్యతిరేకంగా మేం చేస్తున్న పోరాటం మా కోసం కాదు. మా పిల్లల కోసం... ఊరుకు కూత వేటు దూరంలో కంపెనీ నిర్మిస్తున్నారు. పొలాలే కాదు భవిష్యత్‌లో మా పిల్లలు ఇక్కడ జీవించలేరు. కంపెనీ వల్ల నీరు, గాలి, భూగర్భజలాలు ఇలా అన్నీ కలుషితమౌతాయి. వ్యవసాయం చేసుకుంటామని పొలాలు కొని ఇలా రాత్రిళ్లు నిర్మాణాలకు వస్తే ఎలా సహిస్తాం.

- ఎం. జయరామిరెడ్డి, ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

వనపర్తి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వనపర్తి జిల్లా, మండల పరిధిలోని అంజనగిరి శివారులో శుక్రవారం బొలెరో వాహనం, బైకు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాన్‌గల్ మండలంలోని చిక్కేపల్లి గ్రామానికి చెందిన రాఘవేందర్ బులెరో వాహనంలో ఇంటి సామగ్రిని తీసుకొని వనపర్తికి వస్తున్నాడు. గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన రాముడు దిచక్ర వాహనంపై బీసీరెడ్డిపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. రెండు వాహనాలు అంజనగిరి గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో రాముడు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనంపైకి దూసుకెళ్లిన కారు

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి ద్విచక్ర వాహనంపైకి దూ సుకెళ్లడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నారాయణపేట జిల్లా, కొత్త పల్లి మండలంలోని భూనీడు గ్రామ శివారులో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోకుల్‌నగర్‌కు చెందిన పసుల రాజప్ప, అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనంపై కొత్తపల్లి నుంచి గోకుల్‌నగర్ వైపునకు వెళ్తున్నారు. కడప జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ మహేశ్వర్‌రెడ్డి కొత్తపల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న కార్యాలయ భవనాలను పరిశీలించేందుకు కారులో వస్తున్నాడు. భూనీడు శివారులో కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నది. దీంతో రాజప్పకు తీవ్ర గా యాలు కావడంతో మద్దూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సెప్టెంబర్‌లో రాష్ట్ర స్థాయి టోర్నీ

» అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి శరత్‌చంద్ర


అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సెక్రటరీ సారంగపాణిని సన్మానిస్తున్న జిల్లా ప్రతినిధులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్‌లో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శరత్‌చంద్ర తెలిపారు. శుక్రవారం పాలమూరు పట్టణానికి వచ్చిన అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. సారంగపాణిని ఆయనతో పాటు నారాయణపేట జిల్లా కార్యదర్శి రమణ కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ రాష్ట్ర అసోసియేషన్ జిల్లాకు రాష్ట్ర స్థాయి టోర్నీ కేటాయించినట్లు చెప్పారు. అసోసియేషన్ సభ్యులతో చర్చించి పోటీల నిర్వహణకు తేదీలను ఖరారు చేస్తామన్నారు. అనంతరం స్టేడియంను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, జనగామ, వరంగల్ కార్యదర్శులు మనోజ్‌కుమార్, యుగంధర్‌రెడ్డి, సీనియర్ టెక్నికల్ అఫీషియల్ జగన్, సోమశేఖర్, వాసుదేరాజు, ఆనంద్, శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.

జిల్లాలో అండర్-13 షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ

రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ అండర్-13 (బాల, బాలికలలు) టోర్నీని మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించినట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర అసోసియేషన్ ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇన్‌డోర్ స్టేడియంలో సెప్టెంబరు 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. టోర్నీలోని రాష్ట్రంలోని అన్ని జిల్లాల జట్లు పాల్గొంటాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సు బహిష్కరణ

» పెద్ద ధన్వాడ గ్రామస్థుల నిరసన


రైతు వేదిక ముందు నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

రాజోలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలో పెద్దధన్వాడ గ్రామస్థులు శుక్రవారం రెవెన్యూ సదస్సును బహిష్కరించారు. గ్రామంలో ఈనెల 6న నిర్వహించాల్సిన భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సును అధికారులు శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని రైతు వేదికలో తహసీల్దార్ రాంమోహన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించగా, గ్రామస్థులు బహిష్కరించారు. గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించే ఏ సంక్షేమ కార్యక్రమంలోనూ పాల్గొనబోమని తేల్చి చెప్పారు. సదస్సును బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం రైతు వేదిక ముందు నిరసన తెలిపారు. ఫ్యాక్టరీని రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

ఆపదలో ఆపన్నహస్తం

» ప్రాణ దాతలుగా నిలుస్తున్న రక్తదాతలు
» రక్తదానానికి ముందుకొస్తున్న యువత
» వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ ఖాతాలు ఏర్పాటు చేసి సేవలు
» ఆదర్శంగా నిలుస్తున్న పలు ఫౌండేషన్లు
» నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



వనపర్తి పట్టణంలో రక్తదానం చేస్తున్న యువతీ యువకులు (ఫైల్)

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం)/ గద్వాల క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తూ, పలువురు రక్తదాతలు ప్రాణ దాతలుగా నిలుస్తున్నారు. ఎవరైనా, ఎక్కడైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం అందగానే అక్కడికి వెళ్లి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడుతున్నారు. కొందరు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా ఆపదలో ఉన్న వారికి రక్తం అందిస్తున్నారు. మరికొందరు స్వచ్ఛంద సంస్థలు, ఫౌండేషన్లు ఏర్పాటు చేసి ఆపన్నులకు అండగా నిలుస్తున్నారు. ఇలా మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 40 వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపులున్నట్లు సమాచారం. గురువారం రక్తదాతల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

ఆదర్శంగా నిలుస్తున్న యువశక్తి ఫౌండేషన్

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండల కేంద్రానికి చెందిన మధు కాగితాల అనే యువకుడు ఎంఏ, ఎంఎస్సీ, బీఈడీ చేసి ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తున్నాడు. కరోనా సమయంలో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణికి రక్తం అవసరం ఉన్నట్లు తెలియడంతో వెంటనే బయలు దేరాడు. కానీ ఆమె చనిపోయినట్లు మార్గంమధ్యలోనే తెలిసింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆయన రక్తం లభించక ఎవరూ చనిపోవద్దని భావించాడు. అందుకోసం ఓ 10 మంది రక్తదాతలతో కలిసి 2023లో యువశక్తి ఫౌండేషన్ పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం అందులో 4 వేల మంది దాతలు సభ్యులుగా ఉన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 42 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వాటిల్లో 32 వేల మందితో రక్తదానం చేయించారు. సేకరించిన రక్తం నిరుపేదలకే అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఆసుపత్రులకే ఇస్తున్నారు. గర్భిణులు, డెంగీ, తలసేమియా, క్యాన్సర్, డయాలసిస్, అత్యవసర ఆపరేషన్ల సమయంలో అవసరమైన గ్రూపు రక్తం లభించకపోతే వారు స్పందిస్తున్నారు. స్థానిక ఆసుపత్రితో పాటు హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు వెళ్లి రక్తదానం చేస్తున్నారు. వారి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పురస్కారం అందించింది.

స్వామి వివేకానంద సేవాదళ్

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మూడు సంవత్సరాల క్రితం ప్రదీప్ అనే యువకుడు మరి కొందరితో కలసి స్వామి వివేకానంద సేవాదళ్‌ను స్థాపించి, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవాదళ్ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల క్రితం వివేకానంద బ్లడ్ డోనర్స్ పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. అందులో దాదాపు 300 మందికి పైగానే సభ్యులున్నారు. అలాగే ఫేస్‌బుక్‌లోనూ గ్రూప్ కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఎవరికైనా, ఎప్పుడైనా రక్తం అవసరం ఉన్న వీరికి సమాచారం ఇస్తే వెంటనే వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుతున్నారు. సేవాదళ్ సభ్యులు సుంకులమ్మమెట్టు రంగ 13 సార్లు, అశోక్ ఆచారి 37, నర్సింహరెడ్డి 18, పత్తి బద్రీనాథ్ 19, కృష్ణయాదవ్ 13, మహేశ్‌రెడ్డి 11, ఉపేంద్రకుమార్ 31, సృజన్‌కుమార్ రెడ్డి 39, శ్రీకాంత్‌లు 37 సార్లు రక్త దానం చేశారు. వీరితో పాటు సభ్యులు కిశోర్‌గౌడు, పరుమాలరాజు, శివ, రంగన్న, ధరూర్‌శివ, సంజీవ్, సాగర్, కిశోర్, రాంబాబు, కృష్ణగౌడ్, ప్రదీప్‌కుమార్, రామకృష్ణ, గోవర్ధన్, సమీర్, గోపి, అశోక్, అభిలాష్, రఘు, కృష్ణ, పాండురెడ్డి, మహేందర్, మనోజ్‌రెడ్డి, మురళి, నవీద్, పాషా, రాఘవలు పలుమార్లు రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు.



గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపు నిల్వలు

అలవాటుగా మారింది



రక్తదానం చేయడం నాకు అలవాటుగా మారింది. నాది అరుదైన బ్లడ్ గ్రూపు (ఏబీ పాజిటివ్). హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ స్టార్ హాస్పిటల్‌లో మూడు నెలల చిన్నారికి గుండె ఆపరేషన్ నిమిత్తం నా గ్రూపు రక్తం కావాలని యువశక్తి ఫౌండేషన్ గ్రూపులో చూసి, వెంటనే వెళ్లి రక్తం ఇచ్చాను. ఇది నాకు మరచిపోలేని సంఘటన. ఇప్పటి వరకు నేను 12 సార్లు రక్తదానం చేశాను. ఎవరికైనా నా గ్రూపు రక్తం అవసరమైతే గ్రూపులో సమాచారం పెడితే వచ్చి ఇస్తాను.

- శ్రీకాంత్, అమిస్తాపూర్, భూత్పూరు మండలం, మహబూబ్‌నగర్

గర్భిణికి రక్తదానం చేశాను



మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఓ నిండు గర్భిణి కాన్పు కోసం వచ్చింది. ఆమెకు అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని, బి పాజిటివ్ రక్తం కావాలని తెలుసుకొని వెళ్లి రక్తదానం చేశాను. అదే నాకు మొట్టమొదటి సారి. అప్పటి నుంచి ఏ మహిళ కూడా రక్తం లభించక చనిపోకూడదని నిర్ణయించుకొని రక్తదానం చేస్తున్నాను. హైదరాబాద్‌లోని జార్ఖిఖానా ఆసుపత్రికి వెళ్లి కూడా నేను రక్తదానం చేశాను.

- కృష్ణవేణి, నాయినోనిపల్లి, హన్వాడ మండలం

39 సార్లు రక్తదానం



ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదానం చేయాలన్నదే నా కోరిక. ఇప్పటివరకు 39 సార్లు రక్తదానం చేశాను. అత్యవసర సమయంలో ఎవరున్నా సహాయం అందిస్తా. ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేస్తున్నాను.

- సృజన్‌కుమార్‌రెడ్డి, హమాలీ కాలనీ, గద్వాల

ప్రతీ ఏడాది రక్తదానం చేస్తాం



మా నాన్నకు ఓ ఆపరేషన్ నిమిత్తం రక్తం అవసరమైంది. కానీ సకాలంలో రక్తం లభించకపోవడంతో చనిపోయారు. దీంతో రక్తదానం విలువ తెలుసుకున్నాం. మేము నలుగురు అక్కా చెల్లెళ్లం ప్రతీ ఏడాది మా నాన్న వర్ధంతికి రక్తదానం చేస్తాం. నాది 'ఓ' పాజిటివ్ గ్రూపు రక్తం. ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిస్తే వెంటనే వెళ్లి రక్తదానం చేస్తున్నాను. అలా ఇప్పటి వరకు 10 సార్లు రక్తదానం చేశాను. ఎవరికైనా రక్తం అవసరమైతే యువశక్తి ఫౌండేషన్ ద్వారా రక్తదానం చేస్తాను.

- శోభారాణి, వనపర్తి

పుట్టిన రోజున రక్తదానం



ఇంటర్ నుంచే నేను విద్యార్థి ఉద్యమాలలో పాల్గొన్నాను. అప్పటి నుంచే రక్తదానం చేస్తున్నాను. ప్రతీ పుట్టిన రోజున రక్తదానం చేయాలని నిర్ణయించుకొని, 6 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నాను. అలా ఇప్పటి వరకు 17 సార్లు రక్తదానం చేశాను. ఎవరికైనా అత్యవసరం అని పిలిస్తే వెళ్లి రక్తం ఇస్తాను. ఇప్పటివరకు నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లలో సైతం రక్తదాన శిబిరాలు నిర్వహించాను. ఇప్పటి వరకు 10 వరకు శిబిరాలు ఏర్పాటు చేయించి, దాదాపు 150 యూనిట్ల రక్తాన్ని దానం చేయించాను. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రెండు నెలల చిన్నారికి గుండె ఆపరేషన్ నిమిత్తం రక్తదానం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించింది.

- మహేందర్, నాగర్‌కర్నూల్

యువకులు ముందుకు రావాలి



యువకులు చైతన్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది. అలాగే యువకులు ముందుకు వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేస్తే, వారి ప్రాణాలకు కాపాడగలం. ఇప్పటివరకు నేను 37 సార్లు రక్తదానం చేశాను. నేను జీవించి ఉన్నంతవరకు ఇలాగే రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలన్నదే నా ఆశయం.

- శ్రీకాంత్, నల్లకుంట, గద్వాల

రక్తం కొరత లేదు



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తం కొరత లేదు. దానం చేసేందుకు రక్త దాతలు ముందుకు వస్తున్నారు. ఈ విషయంపై పట్టణాలతో పాటు, గ్రామస్థాయిలో కూడా అవగాహన పెరగాలి. ప్రతీ ఒక్కరు రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

- రామకృష్ణ, టెక్నికల్ ఇన్‌చార్జి గద్వాల

రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించాలి

» ముంపు బాధితులకు పరిహారం చెల్లిస్తాం
» రెవెన్యూ డివిజనల్ అధికారి సుబ్రహ్మణ్యం
» ముంపు బాధిత రైతులతో ప్రత్యేక సమావేశం


రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సుబ్రహ్మణ్యం

ఖిల్లాఘణపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గణపసముద్రం రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు పెద్ద మనసుతో సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి సుబ్రహ్మణ్యం కోరారు. రిజర్వాయర్ నిర్మాణంలో భూములను కోల్పోతున్న రైతులతో శుక్రవారం వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి హామీ ఇచ్చినట్లుగా ఎకరానికి ఎకరాకు రూ. 20 నుంచి రూ. 25 లక్షలు చెల్లించాలని కోరారు. కృష్ణా డెల్టా భూములతో సమానంగా పంటలు పండే భూములను కోల్పోవడానికి సిద్ధంగా లేమని రైతులు రాంగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతయ్య, శేఖర్, ప్రభాకర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. తమకు ప్రభుత్వ భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గణప సముద్రం జలాశయం నిర్మాణానికి 603.46 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. అందులో ఇప్పటికే 388.8 ఎకరాలకు గెజిట్ విడుదల చేశామన్నారు. శిఖం భూమి పట్టాలు ఉన్న రైతులు చెరువులో నీరు లేనప్పుడు మాత్రమే పంట వేసుకునే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. ఇప్పటికే బండ్ నిర్మాణానికి రైతుల నుంచి 18 ఎకరాలు సేకరించి, అవార్డు పూర్తి చేసి డబ్బులు మంజూరు చేయించినట్లు చెప్పారు. రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులు 991 మంది ఉన్నారని, వారిలో 251 మంది భూమి ఇచ్చేందుకు అంగీకారం తెలిపి అవార్డు తీసుకున్నారని తెలిపారు. మిగిలిన 740 మంది అంగీకరిస్తే రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి, 5,200 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందన్నారు. ఖిల్లాఘణపురం మండలంతో పాటు మూసాపేట్ మండలంలోని నిజాలాపూర్, మహమ్మద్‌హుస్సేన్‌పల్లి మూసాపేట్ గ్రామాల పరిధిలోని భూములకు సాగునీరు అందుతుందని తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం రూ. 11 లక్షల నుంచి రూ. 12 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

భూముల కు బదులు భూములు, ప్లాట్లు, ఇండ్లు, ఉద్యోగాలు ఇచ్చే విధంగా చట్టంలో లేదని గుర్తు చేశారు. ఇప్పటికే భూ సేకరణ ఆలస్యమైనందున వచ్చే నెల 1వ తేదీ నుంచి అవార్డు ప్రక్రియను చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నరేందర్‌రెడ్డి, సర్వేయర్ ఆనంద్, వివిధ పార్టీల నాయకులు సాయిచరణ్‌రెడ్డి, శ్యామ రాజు, రాళ్ల కృష్ణయ్య, వెంకటరమణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులు శిక్షకులుగా మారాలి

» ఇందిరా సౌర గిరి జల వికాసం ద్వారా శిక్షణ
» నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్


ఇందిరా సౌర గిరి జల వికాస ట్రైనర్స్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గిరిజన రైతులు రాష్ట్ర స్థాయి శిక్షకులుగా మారాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. ఉద్యాన పంటలపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన అనంతరం వారి సేవలను రాష్ట్ర స్థాయిలో వినియోగించుకోనున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో గత నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరా సౌరగిరి జల వికాసం పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. అందులో లబ్ధిదారులైన ముగ్గురు రైతులకు ఉద్యాన పరిశోధనా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించి, వారి సేవలను రాష్ట్ర వ్యాప్తంగా వినియోగించుకోనున్నారు. అందుకోసం ఎంపికైన కే రాజకుమార్, యూ లక్ష్మీ, యూ ఆలివేలలతో శుక్రవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడారు. పాలెం కేవీకే, నల్లగొండ, మల్లేపల్లి ఉద్యాన శిక్షణ కేంద్రం, సంగారెడ్డి ఉద్యాన శిక్షణ పరిశోధన కేంద్రాల్లో పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం రాష్ట్ర స్థాయి శిక్షకులుగా వ్యవహరించాల్సి ఉంటుందని వారికి చెప్పారు. శిక్షణలో ఆ విధమైన నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో అన్ని రకాల ఉద్యాన పంటలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. నల్లగొండ జిల్లా, కొండమల్లేపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రంలో నిమ్మల బత్తాయి సాగుపై, సంగారెడ్డి జిల్లా ఉద్యాన శిక్షణ, పరిశోధన కేంద్రంలో మామిడి పంట సాగుపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గిరిజన రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనుల భూముల్లో అనువైన పండ్ల తోటల పెంపకానికి కృషి చేయాలని కోరారు. ఇందిరా సౌరగిరి జల వికాసం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా కృషి చేయాలని, అప్పుడే నల్లమల ప్రాంతానికి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం పాల్గొన్నారు.

జడ్చర్లలో భారీ వర్షం


జడ్చర్ల పట్టణంలో నేతాజీ చౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డకు వెళ్లే ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు


అమ్రాబాద్‌లో రహదారిపై పారుతున్న వర్షపు నీరు

జడ్చర్ల/అమ్రాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీతో పాటు, పరిసర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని పాత బజారు నుంచి వర్షపు నీరు గౌడఫంక్షన్‌హాల్ పక్కనున్న డ్రైనేజీలో కలిసింది. ఆ నీరు నల్లకుంట మీదుగా నేతాజీచౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డకు వెళ్లే ప్రధాన రహదారిపైకి వచ్చి చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బాదేపల్లి మార్కెట్‌లో కూడా వర్షం నీరు వరదలా పారింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపునీరు రావడంతో బకెట్లతో నీటిని తోడి పోసుకున్నారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండల కేంద్రంతో పాటు, మాధవాన్‌పల్లి, కుమ్మరోనీపల్లి, ఈదుల బావి, కొత్తపల్లి, ఎల్మపల్లి, మాచారం, తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి పొరలాయి. మండల కేంద్రంలో రోడ్లు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

పిడుగుపాటుతో రెండు పశువులు మృతి

వంగూరు (ఆంధ్రజ్యోతి) : పిడుగుబాటుతో రెండు పశువులు మృతి చెందాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని మిట్టసదగోడు గ్రామానికి చెందిన రైతు మహేశ్ పొలంలో దుక్కిదున్నిన తర్వాత కాడెద్దులను చెట్టు కిందకు చేర్చాడు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసి, చెట్టు పక్కనే పిడుగు పడింది. దీంతో ఎద్దులు అక్కడికక్కడే చనిపోయాయి. వాటి విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు.


అమ్రాబాద్‌లో వర్షపు నీటితో నిండిన కత్వ వాగు

ఇంటర్వ్యూ..

విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తాం

- ఝాన్సీరాణి, ఎంఈవో, చారకొండ



చారకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలలో ప్రతీ విద్యార్థికి గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు అందరు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని ఎంఈవో ఝాన్సీరాణి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి?

మండలంలో 22 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 1,054 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి మెనూ ప్రకారం మధ్యాహ్నం నాణ్యతమైన భోజనం అందిస్తున్నాం.

బడిబాటతో ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయి?

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 6నుంచి 19వరకు నిర్వహిస్తాం. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

విద్యార్థులకు మీరు ఏవిధమైన విద్యను అందిస్తున్నారు ?

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రతీ ఉపాధ్యాయుడు విద్యాశాఖ నుంచి ప్రత్యేక శిక్షణ పొందారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తాం.

విద్యార్థులకు ఇవ్వడానికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం దుస్తులు సిద్ధంగా ఉన్నాయా?

మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం దుస్తులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

న్యూస్ బాక్స్

పోరాటాలకు సిద్ధం కావాలి : సీపీఐ

పెద్దకొత్తపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.నరసింహ, మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ పెద్దకొత్తపల్లి గ్రామ శాఖ మహాసభలో వారు మాట్లాడారు. సీపీఐ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా లక్ష్మణస్వామి, సహాయ కార్యదర్శులుగా రామస్వామి, కుర్మయ్య, కమిటీ సభ్యులుగా బాలస్వామి, లక్ష్మయ్య, బిజినేపల్లి మశన్న, సలహాదారులుగా కావలి సాయిలు ఎన్నికయ్యారు.

16న కొబ్బెరచిప్పల సేకరణ, పూల విక్రయానికి వేలం

బిజినేపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొబ్బెరచిప్పల సేకరణ, పూలు, పూలదండలు విక్రయించుకునేందుకు ఏడాది కాలం పాటు హక్కు పొందేందుకు ఈనెల 16న ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చిలుకూరి రంగారావు శుక్రవారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనదలిచిన వారు రూ.5 వేల చొప్పున డిపాజిట్ చేయాలని సూచించారు. ఆలయంలో ఇంతకు ముందు పెండింగ్ బకాయిలు ఉన్నవారికి వేలంలో పాల్గొనరాదని తెలిపారు.

ఉరి వేసుకొని విద్యార్థి ఆత్మహత్య



తమన్నచౌహాన్ (ఫైల్)

వెల్దండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బొల్లిగుట్టతండాలో శుక్రవారం సాయంత్రం కొర్ర తమన్నచౌహాన్ (12) అను విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే... తండాకు చెందిన కొర్ర కిషన్, శారద దంపతులకు ఇద్దరు కుమారులు పృథ్వీరాజ్ చౌహాన్, తమన్న చౌహాన్‌లు ఉన్నారు. వీరిలో తమన్నచౌహాన్ చిన్నవాడు. కిషన్ తన ఇద్దరు పిల్లలను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదివిస్తూ, అక్కడే హాస్టల్‌లో ఉంచాడు. కిషన్, శారద దంపతులు తమ పెద్దకుమారుడు పృథ్వీరాజ్ చౌహాన్‌లతో కలిసి పొలం వద్దకు పత్తి విత్తనాలు నాటేందుకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో తమన్న చౌహాన్ తమ ఇంటిపై ఉన్న రేలింగ్‌కు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని వచ్చిన కిషన్ దంపతులు తమ కుమారుడు మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. ఈ సంఘటనతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎందుకు ఈ దుర్ఘటనకు పాల్పడ్డాడో వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటనపై ఎటువంటి కేసునమోదు కాలేదు.

సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరిస్తాం : ఆర్డీవో

కల్వకుర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారని కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను తెలిపారు. మండల పరిధిలోని తర్నికల్, కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం తహసీల్దార్ ఇబ్రహీం ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ భూ సమస్యలు లేకుండా చూడడమే లక్ష్యమన్నారు. తర్నికల్‌లో 87, కల్వకుర్తిలో 49దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఇబ్రహీం తెలిపారు. డీటీలు అనిత, రాఘవేందర్, ఆర్‌ఐలు రవూఫ్, రోహిత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆస్పత్రి భవనం

- ఊచలు తేలి కూలేలా ఉన్న పెద్దకొత్తపల్లి పీహెచ్‌సీ భవనం

- భయాందోళనలో వైద్య సిబ్బంది, రోగులు

- నూతన భవనం కోసం ప్రజల డిమాండ్

పెద్దకొత్తపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ఇనుప ఊచలు తేలి ఇప్పుడో, అప్పుడో కూలేలా ఉంది. 25ఏళ్ల క్రితం నాలుగు పడకల ఆసుపత్రి భవనాన్ని అన్ని హంగులతో నిర్మించారు. గతంలో ప్రజలు నాగర్ కర్నూల్, వనపర్తి, కొల్లాపూర్, మహబూబ్‌నగర్‌కు వెళ్లి వైద్యం చేయించుకునేందుకు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో అప్పటి ప్రభుత్వాలు పెద్దకొత్తపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని నిర్మించారు. ఆసుపత్రిలో అన్ని గదులు ఇనుప ఊచలు తేలడంతో చికిత్స చేయించుకునేందుకు వచ్చే రోగులు భయపడుతున్నారు. వైద్య సిబ్బందికి సైతం నిత్యం బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఆసుపత్రి సమీపంలో ఉన్న ఏఎన్ఎం గది శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా ఉంది. ఆసుపత్రి ప్రాంగణ మంతటా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రంగా ఉంది. నిత్యం ఆసుపత్రిలో పాములు, తేళ్లు, జర్రులతో పాటు క్రిమికీటకాలు సంచరిస్తుంటాయని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. పెద్దకొత్తపల్లి ముఖ్య కూడలిలో ఉన్నందున నిధులు మంజూరు చేయించి నూతన భవనం నిర్మించాలని పలు మార్లు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వైద్య సిబ్బంది, రోగులు ఆరోపిస్తున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి పెద్దకొత్తపల్లిలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దకొత్తపల్లి పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న ఏఎన్ఎంల క్వార్టర్స్ భవనం



పెచ్చులు ఊడి, ఫ్యాన్ వంగి ఉన్న ఆయుష్‌శాఖ ఆరోగ్య స్వస్థత కేంద్రం

నూతన భవనం నిర్మించాలి



పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ఇనుప ఊచలు తేలి కూలేలా ఉంది. శిథిలావస్థకు చేరుకున్న ఆసుపత్రి భవనంలో ఉంటూ రోగులకు వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రోగులు సైతం భయపడుతు న్నారు. అధికారులు స్పందించి పెద్దకొత్తపల్లి 30 పడకల ఆసుపత్రి భవనాన్ని నిర్మించాలి.

- జలాల్ శివుడు, పెద్దకార్పాముల

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

వెల్దండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కొట్ర గ్రామంలో పాథమిక, ఉన్నత పాఠశాలలను డీఈవో తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మౌలిక వసతులగురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల గణిత, ఆంగ్ల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని డీఈవో ఆకాంక్షించారు. కార్యక్రమంలో టెస్ట్‌బుక్ మేనేజర్ నర్సింహులు ఉన్నారు.

మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఎంపీపీ పాఠశాలలో చిన్నారులకు ప్రధానోపాధ్యాయురాలు పావని, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్, దాసు, అంగన్‌వాడీ టీచర్ మాసమ్మ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారులకు పలకలపై అక్షరాలు దిద్దించి, మిఠాయిలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

కొల్లాపూర్ :మండల పరిధిలోని ఎల్లూరు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంతో పాటు నోటు పుస్తకాలకు, పాఠ్య పుస్తకాలకు ఉపాధ్యాయులు అందజేశారు.

చదువుతోనే గౌరవం

పదర : మండలంలోని మద్దిమడుగు ప్రాథమిక పాఠశాలలో మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రి ఆధ్వర్యంలో సరస్వతీ పూజ చేయించారు. కాంప్లెక్స్ హెచ్ఎం అడపాల రామిరెడి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, ఉపాధ్యాయులు స్వాతి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఆర్ నిరంజన్, అంగన్‌వాడీ టీచర్ వేణుకుమారి, గ్రామ స్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా...

అచ్చంపేటటౌన్ : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన అందిస్తున్నామని ఎంఈవో జీవన్‌కుమార్ అన్నా రు. శుక్రవారం మండల పరిధిలోని సిద్ధాపూర్ ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్మారెడ్డిపల్లిలో అక్షరాభ్యాసం

తెలకపల్లి : మండల పరిధిలోని పీఎస్ కమ్మారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఒకటవ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. పాఠ శాల ప్రధానోపాధ్యాయులు, ఏ రఘురామయ్య, ఉపాధ్యాయులు, స్థానిక అంగన్‌వాడీ టీచర్, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలి

తిమ్మాజిపేట : గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించి పాఠశాలల బలోపేతానికి సహకరించాలని ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని గుమ్మకొండ పాఠశాలలో విద్యార్థు లచే అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఉపాధ్యాయులు మధుసూదనాచారి, మృదుల, సకీనాబేగం, సింధూరి, నాయకులు అయూబ్‌ఖాన్, రాజు, సద్దాం, పాల్గొన్నారు.



వెల్దండ : కొట్ర పాఠశాలలో విద్యార్థి పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో రమేష్ కుమార్

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

వంగూరు : తల్లిదండ్రులు తమ పిల్లను ప్రభుత్వ బడిలో చేర్పించి నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో మురళీమోహనాచారి అన్నారు. మండలంలోని డిండి చింతపల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మచారి, హెచ్ఎం చిన్నయ్య. నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బొజ్జయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

ఉప్పునుంతల : మండల కేంద్రమైన బాలుర ప్రాథమిక పాఠశాలతో పాటు మండల పరిధిలోని జప్తిసదగోడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు భార్గవి, హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయు లు వెంకటేష్, చందన, సంగీత, అంగన్‌వాడీ టీ చర్ సావిత్రి, నాయకులు శ్రీనివాసులు, రామ చంద్రయ్య, భాస్కర్, రాజేందర్, నాగిరెడ్డి, జహంగీర్, వెంకటేష్, లక్ష్మయ్యగౌడ్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు సకాలంలో పూర్తి చేయాలి

- రాష్ట్ర టెలికాం శాఖ డైరెక్టర్ శ్రీనివాస్ బహదూర్



బావాజీపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తిమ్మాజిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర టెలికాం శాఖ డైరెక్టర్ శ్రీనివాస్ బహదూర్ లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని బావాజీపల్లిలో ఇంటి నిర్మాణానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, నాయకులు రామకృ ష్ణగౌడ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభింపజేశారు. ఆయన మాట్లాడుతూ గూడు లేని నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూ రవుతాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు గా ఉండాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకు లు మహమ్మద్ రవూఫ్, బంగారయ్య, రమేష్ పాల్గొన్నారు. అదేవిధంగా పుల్లగిరి గ్రామలోని ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు.

● చారకొండ : రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందజేస్తున్నట్ల ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ ఏఈ సురేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలరాంగౌడ్‌తో కలిసి ఎంపీడీవో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, నాయకులు నరేందర్‌రెడ్డి, గుండె శివగౌడ్, వెంకటయ్య గౌడ్, కందికంటి శ్రీను, రామకృష్ణగౌడ్, లక్ష్మయ్యగౌడ్ పాల్గొన్నారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు

- కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

నాగర్‌కర్నూల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడైనా బడిఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదావత్ సంతోష్ హెచ్చరించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరిం చుకుని జిల్లా కార్మిక శాఖ, జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం వాల్‌పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో హోటళ్లు, వ్యాపార సంస్థలు, వ్యవసాయ పొలాలు, గృహాల్లో చిన్నారులు పని చేస్తూ కన్పిస్తే స్పెషల్ ఆపరేషన్ల ద్వారా గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికులు కన్పిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 1098, 112కు ఫోన్ చేసి తెలపాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, జిల్లా లేబర్ ఆఫీసర్ రాజ్‌కుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్ లక్ష్మణ్‌రావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీశైలంగౌడ్, సఖి కో ఆర్డినేటర్ సునీత, బాలల సమితి కో ఆర్డినేటర్ శ్వేత పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట : ఎమ్మెల్యే



రైతులకు స్ప్రింక్లర్ పైపులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం వంగూరులోని రైతు వేదికలో రైతులకు సబ్సిడీపై మంజూరైన పైపుల ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అరకొరగా రుణమాఫీ చేసి రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసా, సబ్సిడీపై పైపులు, భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి వంటి పథకాలను అమలు చేసి రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అల్వాల్‌రెడ్డి, ఎంపీడీవో బ్రహ్మచారి, రమేష్‌గౌడ్, క్యామ మల్లయ్య, హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలను బడిలో చేర్పించాలి : ఎమ్మెల్యే

బల్మూరు : చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారికి భవిష్యత్తును అందించాలని తల్లిదండ్రులను ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీలో ఏర్పాటు చేసిన అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, నోట్ బుక్కులు, పాఠ్యపుసకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పీడీ రాజేశ్వరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సీడీపీవో దమయంతి, ఎంపీడీవో రాఘవులు, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు ఖదీర్, నాయకులు కాశన్న యాదవ్, ఎలికంటి శ్రీనివాసులు, మాసన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నిర్మల, బీపాషా, అంగన్‌వాడీ టీచర్లు నీలాబాయి, సునీత, భాగ్యమ్మ, జయప్రద, శ్రీదేవితో పాటు గర్భిణులు, బాలింతలు, బాల, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న బల్మూరి జానకి

చారకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ మండల మొదటి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశా నికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. బీజేపీ 11 ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు ఎంతో మేలు జరిగిందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకొంటున్న చారిత్రాత్మక నిర్ణయాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయని అన్నారు. 11 సంవత్సరాల మోదీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు చెప్పి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు ఆమె కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు వేణుశర్మ, హరిబాబు, కొండల్, నాయకులు శ్రీకాంత్, వెంకట్‌గౌడ్, చంద్రారెడ్డి, రామకృష్ణగౌడ్, శ్రీరామ్ పాల్గొన్నారు.

పుల్జాలలో బీజేపీ సంకల్ప సభ

కందనూలు : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని పుల్జాల గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల స్థాయి సంకల్ప సభ మండల అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు నాగేంద్రగౌడ్ పాల్గొ న్నారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలనలో భారతదేశంలో ఆర్థిక రంగంలో 12వ స్థానం నుంచి నాల్గవ స్థానానికి అభివృద్ధి దిశగా ఎగబాకిందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోల్‌దాసు రాము, రాష్ట్ర కౌన్సిల్ నెంబరు శ్రీశైలం, నాయకులు రమణారెడ్డి, చందు, గోపాల బాల మల్లయ్య, సత్యనారాయణ, రాజేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

కందనూలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో క్షేత్ర స్థాయి సిబ్బందికి సీజనల్ వ్యాధుల నివారణపై ఆమె అవగాహన కల్పించి, మాట్లాడారు. క్షేత్రస్థాయి సిబ్బంది గత సంవత్సరం ఎక్కువగా డెంగీ, మలేరియా, నీళ్ల విరేచనాలు, జ్వరాలు నమోదైన గ్రామ, పట్టణ ప్రాంతాల్లో అంటు వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ డివిజన్ ఉప జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటదాస్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ప్రదీపన్, ఎపిడెమియాలజిస్టు ప్రవళ్లిక, ఎఎంవో ఆర్.శ్రీనివాసులు, డీపీవో రేణయ్య, ఏపీవో విజయ్ కుమార్, రాజేష్, వివిధ ఆస్పత్రుల ఎంఎల్‌హెచ్‌పీలు, పర్యవేక్షణ సిబ్బంది, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ధ్వంసం చేసిన చోటే కొత్త ట్యాంకులు నిర్మిస్తాం

కోడేరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మినీ వాటర్ ట్యాంక్‌ను ధ్వంసం చేసిన స్థానంలోనే నూతన మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతామని గ్రామ పంచాయతీ కార్యదర్శి రవితేజ తెలిపారు. ఈ విషయమై బీసీ కాలనీ ప్రజలు వాటర్ ట్యాంకులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకొని నూతనంగా వాటర్ ట్యాంకులను నిర్మించాలని తహసీల్దార్‌కు, గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినందున ఆయన తెలిపారు.

భూ సమస్యల పరిష్కారం

అచ్చంపేటటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం అవుతాయని తహసీల్దార్ సైదులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి ఆయన పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గౌరీశంకర్, నాయకులు అంతటి మల్లేష్, పాల్గొన్నారు.

● తాడూరు : గ్రామాల్లో రైతులకు సంబంధించి నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జయంతి అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. శుక్రవారం మండలంలోని భలాన్‌పల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారు. సదస్సులో రైతుల భూములకు సంబంధించిన సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. భూ భారతి చట్టంతో క్షేత్రస్థాయిలోని భూ సమస్యలు పరిష్కరించేందుకు సిబ్బంది అందరూ ప్రయత్నించాలన్నారు. ప్రతీ దరఖాస్తును ఎంట్రీ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్‌అలీ, ఆర్‌ఐలు సల్మాన్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉచిత విద్యుత్ పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా రజక వృత్తిదారులకు, నాయీ బ్రాహ్మణులకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో రజక సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి ఈ నెల 17న చలో హైదరాబాదు కరపత్రం విడుదల చేశారు. ఈ నెల 22న హైదరాబాదు ఇందిరాపార్కులో నిర్వహించ తలపెట్టిన మహాధర్నాలో జిల్లాలోని రజకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దాపురం కాశీశ్వర్, కొట్ర నిరంజన్, మల్లేష్, దాసరాజుల రవి, ఇంద్రకంటి బాలస్వామి, మొగిలి శ్రీనివాసులు, అగాడి గౌరయ్య, జంగయ్య పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ దళితుడికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి : కేవీపీఎస్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అర్హులైన ప్రతీ దళితుడికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండు కూడలిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పల్లె రాజు, ఆంజనేయులు, నాగరాజు, పరమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ ప్రతిభ నిధి పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కల్వకుర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : భారత ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే (నేషనల్ మెన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) ఎన్ఎంఎంఎస్ జాతీయ ప్రతిభ నిధి పరీక్షల్లో కల్వకుర్తి ప్రాంతానికి చెందిన ఆరుగురు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. కల్వకుర్తి పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన యాస్మిన్‌బేగం, వడాల నిఖిత, సింగిశెట్టి ప్రశాంతి, బండి పూజ, కొమ్ము యామని, మండల పరిధిలోని తాండ్రా జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన జగదీశ్వర్‌లు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పూల మాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి : ఏబీవీపీ

కల్వకుర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, అక్రమంగా పుస్తకాలను విక్రయించవద్దని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎంఈవో శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని నాయకులు వంశీ, ప్రశాంత్ ఉన్నారు.

గాంధీ విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్ఠించాలి : అఖిలపక్షం

పెద్దకొత్తపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో కొందరు ఈ నెల 9న అర్ధరాత్రి గ్రామ నడిబొడ్డున 60 ఏళ్ల క్రితం ప్రతిష్ఠించిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని తొలగించారని, తిరిగి యథాస్థానంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించే వరకు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని అఖిలపక్షం నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దకొత్తపల్లిలో అఖిల పక్షం నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రి గాంధీవిగ్రహాన్ని తొలగించడం సరికాదని అఖిల పక్ష నాయకులు ధ్వజమెత్తారు. సమావేశంలో అఖిలపక్షం నాయకులు పదిర భీమేష్, నాగరాజు, కాశిరెడ్డి, పోల కిశోర్, రాజశేఖర్, శ్యాంసుందర్, శ్రీనివాసులు, ప్రేమ్‌కు మార్, పరశురామ్, మల్లేష్, భాస్కర్, శేఖర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన బస్ చార్జీలు తగ్గించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్ చార్జీలను వెంటనే తగ్గించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలు, పేద విద్యార్థులపై బస్ చార్జీలు, బస్‌పాస్ చార్జీలు భారం మోపడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి బస్ చార్జీలను తగ్గించి పేదలకు అండగా నిలవాలని ఆయన కోరారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

కొల్లాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణంలోని ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ యాదవ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని అన్ని ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ దుకాణాల డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. విత్తనాలు ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్ ఇవ్వాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, స్టార్ బోర్డు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. ఎవరైనా గ్రామాలలో రాత్రిపూట తిరిగి విత్తనాలు అమ్మితే వ్యవసాయ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు 17వ వార్డులో వైద్య శిబిరం

కల్వకుర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మునిసిపాలిటీలో 17వ వార్డులో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ షేక్ ఏజాస్ తెలిపారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఆవరణలో ఉదయం 11గంటలకు వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.